క్లుప్తంగా

వెలుగు అధికారులతో ఎమ్మెల్యే సమావేశం నేడు

ప్రత్తిపాడు: మండలంలోని తిక్కిరెడ్డిపాలెం కల్యాణ మండపంలో సోమవారం ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు వెలుగు అధికారులు, వీవోఏలతో సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఏపీఎం వి.లాజరు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యులను పారిశ్రామిక వేత్తలుగా మార్చేందుకు చేపట్టాల్సిన విధివిధానాలపై సమావేశం జరగనుందని చెప్పారు. సమావేశానికి నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు, గుంటూరు రూరల్ మండలాల ఏపీఎంలు, సీసీలు, వీవోఏలు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

రైల్వే స్టేషన్లలో తాగునీటి వసతిపై తనిఖీ



లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని పలు స్టేషన్లను డీసీఎం కమలాకర్ బాబు ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు- మాచర్ల, రేపల్లె- గుంటూరు, గుంటూరు- మంగళగిరి స్టేషన్‌ల పరిధిలో ఈనెల 19,20వ తేదీలలో ఈస్టర్ పండుగ సందర్భంగా ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగ కుండా తగిన చర్యలను తీసుకోవాడం జరిగిందని చెప్పారు. సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి స్టేషన్‌లలో మాచర్ల, మంగళగిరి, రేపల్లె స్టేషన్‌లలో అన్ని ప్రయాణికుల సౌకర్యాలను తనిఖీలు చేసి, తాగునీరు, మినరల్ వాటర్ అందుబాటులో లేకపోవడంతో తక్షణమే ఏర్పాట్లు చేయించినట్లు వివరించారు. వీటికి సంబంధించి స్వచ్ఛంద సంస్థలు, ప్లాట్ పామ్‌లపై తాగునీటి బూత్‌లతో పాటు చల్లని తాగునీటిని, సారా ఫౌండేషన్ అందించడం అభినందనీయం అన్నారు. మాచర్ల రైల్వే స్టేషన్‌లో స్టేషన్ సూపరిటెండెంట్‌కు రెండు సార్లు నివేదించాలని సూచించినట్లు చెప్పారు. పశువుల యజమానుతో అవగాహన సమావేశాలు నిర్వహించి, పశువులను రైల్వే ట్రాక్ దగ్గర వదిలివేయవద్దని సూచించారురు. రైల్వే నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా యజమానులను హెచ్చరించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు.

నేడు డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్‌ఎస్ కార్యక్రమం

నెహ్రూనగర్: నగర ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్(0863-2224202) కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'(పీజీఆర్‌ఎస్) కార్యక్రమం జనన, మరణ నమోదు కార్యాలయం వద్ద(పార్కింగ్ వద్ద) మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజల నుంచి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు నగర తెలిపారు.

23న జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన

నెహ్రూనగర్: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై హైకోర్టు జడ్జి పర్యవేక్షణలో సీబీఐ సీనియర్ అధికారులతో విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వానికి క్రైస్తవ కార్యాచరణ కమిటీ నాయకులు, సామాజికవేత్త డాక్టర్ గోళ్లమూడి రాజా సుందర బాబు విజ్ఞప్తి చేశారు. ఆదివారం సాయంత్రం అరండల్‌పేటలోని ఓ హోటల్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. నగరానికి నాలుగు వైపుల క్రైస్తవుల సమాధుల తోటకు స్థలాలను కేటాయించాలని పలు కోరుతూ ఈ నెల 23వ తేదీన గుంటూరు కలెక్టరేట్ వద్ద క్రైస్తవ నాయకులు, పాస్టర్లతో కలిసి నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో క్రైస్తవ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు మద్దు ప్రేమ జ్యోతి బాబు, క్రైస్తవ సంఘాల నాయకులు సంఘాల నాయకులు బండ్లమూడి మధు, గద్దె రచన శ్రీ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

నగరంపాలెం: వాసవి క్లబ్ గుంటూరు గత 25 ఏళ్లుగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని శ్రీ లలితా పరమేశ్వరి స్పిన్నింగ్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ దేసు సూర్య ప్రకాశరావు అన్నారు. వాసవి క్లబ్ గుంటూరు, మహిళా గుంటూరు, యువ గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఆర్.అగ్రహారం శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఆవరణలో 108 మంది వృద్ధులకు ఉచితంగా బియ్యం, పింఛన్లు పంపిణీ చేశారు. సభకు అధ్యక్షత వహించిన క్లబ్ అధ్యక్షులు రాయవరపు అశోక్ కుమార్ మాట్లాడుతూ వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ చరిత్రలో తొలిసారి గుంటూరు క్లబ్ ఈ ఉచిత బియ్యం పంపిణీని ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి కూనిశెట్టి చంద్రశేఖర రావు, కోశాధికారి వేమూరి ప్రదీప్‌కుమార్, రీజియన్ చైర్‌పర్సన్ మున్నలూరి గౌరీశంకర్ పాల్గొన్నారు.

పేట్రేగిపోతున్న రేషన్ మాఫియా

- పక్క రాష్ట్రాలకు రేషన్ బియ్యం అక్రమ రవాణా
- ప్రేక్షక పాత్రలో అధికారులు

గుంటూరు రూరల్: గుంటూరు నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లో రేషన్ మాఫియా ఆగడాలు రోజురోజుకి పెచ్చుమీరుతున్నాయి. పేదలకు అందాల్సిన చౌక బియ్యం రేషన్ మాఫియా చేతుల్లోకి వెళ్లి జిల్లాల సరిహద్దులు దాటుతుంది. నగర శివారులోని అడవితక్కెళ్లపాడు ప్రాంతంలో టిడ్కో ఇళ్లల్లో ఇటీవల కాలంలో రేషన్ బియ్యం పంపిణీ వ్యవహారం అనుమానాస్పదంగా తయారైంది. లబ్ధిదారులకు రేషన్ బియ్యం ఇవ్వకుండా డీలర్లే కిలోకి రూ.12 రేటు కట్టి చేతికి డబ్బులు ఇవ్వటం దర్శనమిస్తోంది. దీంతో ఈ ప్రాంతంలో రేషన్ డీలర్లు పేదలకు చేరాల్సిన బియ్యం బొక్కేస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. రేషన్ డీలర్లు ఈ బియ్యాన్ని బడా నాయకులకు చేరవేసి రూ.20 నుంచి రూ.25 వరకూ అధిక మొత్తంలో లబ్ధి పొందుతున్నారన్న ప్రచారం జరుగుతోంది.

బియ్యానికి బదులు నగదు పంపిణీ..

మండలంలోని ఇతర గ్రామాలైన వెంగళాయపాలెం, ఓబులునాయుడుపాలెం, లాలుపురం, నల్లపాడు, చల్లావారిపాలెం, తురకపాలెం, చిన్నపలకలూరు, గోరంట్ల, రెడ్డిపాలెం, చౌడవరం, ఏటుకూరు, బుడంపాడు, తదితర గ్రామాల్లో సైతం ఇదేవిధంగా రేషన్ డీలర్లు లబ్ధిదారులకు రేషన్ బియ్యం ఇవ్వకుండా నగదు పంపిణీకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని చర్చనీయాంశంగా మారింది. ప్రతీ గ్రామంలోనూ ఇదే విధంగా పేదల బియ్యంకు బదులు ఎక్కువ శాతం నగదు చెల్లింపులే జరుగుతున్నాయని.. ఈ సంగతి అధికారులకు కూడా తెలిసిన విషయమే అని స్థానికులు అంటున్నారు. లబ్ధిదారులకు నగదు చెల్లించి డీలర్లే ఆ బియ్యాన్ని అర్ధరాత్రి సమయాల్లో ఆటోలు, చిన్నపాటి టాటాఏసీ వాహనాల్లో బడా నేతలకు తరలించి వాటిని నగర శివారుల్లోని ఒక మిల్లులో పాలిష్ చేయించి 10, 20, 30 కిలోల బ్యాగుల్లో సర్ది చక్కగా జిల్లాలు, పక్క రాష్ట్రాలనే దాటించి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.



నగర శివారులో పట్టుబడిన రేషన్ బియ్యం(ఫైల్)

అధికారులు చర్యలు తీసుకోవాలి..

పేదల వద్ద రూ.12 కొన్న బియ్యాన్ని కొద్దిపాటి పాలిష్ చేయించి బడా నేతలు రూ.45 నుంచొ రూ.60 రూపాయలకు విక్రయించి సొమ్ము చేసుకుని రూ.లక్షల్లో దండుకుంటున్నారని సమాచారం. ఈ విధంగా వారంలో కనీసం మండలం నుంచి సుమారుగా 10 లారీలకు పైగా రేషన్ బియ్యం ఇతర ప్రాంతాలకు తరలుతున్నట్లు గ్రామాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇంత జరుగుతున్నా పౌర సరఫరాలశాఖ, పోలీసుశాఖ, రెవెన్యూశాఖ అధికారులు సైతం మిన్నకుండిపోవడం గమనార్హం అని స్థానికులు వాపోతున్నారు. పేదలకు చేరాల్సిన బియ్యంలో చేతివాటాన్ని ప్రదర్శిస్తున్న వ్యక్తులపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పోలీస్‌స్టేషన్‌లో పెద్దల పంచాయితీ..

అధికారులు దాడులు చేసి రేషన్ బియ్యం ఆటోలను పోలీస్‌స్టేషన్‌ల వద్దకు తెస్తే అధికార పార్టీ పెద్దలు అక్కడికి చేరుకుని పోలీస్‌స్టేషన్‌నే పెద్దల పంచాయితీగా మారుస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. స్థానిక అధికార నాయకులు తమ పార్టీ కార్యాలయాలుగా మార్చి పంచాయితీలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇటీవల మండల పరిధిలో పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన రేషన్ బియ్యం ఆటోను సైతం ఇదే విధంగా అధికార పార్టీకి చెందిన పెద్దలు పంచాయితీ చేసి బయటకు పంపారని గ్రామాల్లో చర్చనీయాంశంగా మారింది.

కాలువ మట్టి.. చేనుకు మెరక!

యథేచ్ఛగా తవ్వకాల్లో కూటమి నాయకుడు

పెదకాకాని: పాలించేవాడు మనవాడైతే ఏం చేసినా అడ్డు చెప్పేవారే ఉండరన్న చందంగా స్థానిక కూటమి నాయకులకు కాలం సాగుతుంది. మండంలోని తక్కెళ్లపాడు వాటర్ ట్యాంక్ సమీపంలో గుంటూరు ఛానల్(కొత్త కాలువ) కట్టను గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రైతు చేబ్రోలు అప్పారావు ప్రొక్లెయిన్‌తో తవ్వించి తన చేనుకు మెరక వేసుకుంటున్నారు. ఈ ఏడాది అధికంగా కురిసిన వర్షాలకు కాలువ కట్టలు బలహీనంగా మారడంతో పాటు కాలువ కట్టకు పలు చోట్ల గండ్లు పడి వరి పొలాల్లోకి నీరు చేరి పైర్లు దెబ్బతిన్నాయి. అయినప్పటికీ కాలువ కట్టలను ఎటువంటి పటిష్టం చేయకపోగా ఆదివారం గ్రామానికి చెందిన ఆయన ఏకంగా కట్టను తవ్వి ఆ మట్టిని ట్రాక్టర్లతో తన పొలంలోకి చేర్చుకున్నారు. కాలువ కట్ట దెబ్బతింటుందని భావించిన పలువురు రైతులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ ప్రాంతానికి గ్రామ వీఆర్వో జగదీష్, కాలువ కట్టలకు సంబంధించిన లష్కర్ శ్రీనులు చేరుకుని తవ్వకాలను అడ్డుకున్నారు. అప్పటికే 50 ట్రక్కులకు పైగా కాలువ మట్టిని తన పొలంలోకి తరలించేశారు. దీనిపై అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో చూడాలని స్థానికులు చర్చించుకుంటున్నారు.



కట్టను తవ్వి పొలంలో మెరక చేసుకుంటున్న దృశ్యం

మే 10న పాలపర్రు హైస్కూల్ వజ్రోత్సవాలు

గుంటూరు ఎడ్యుకేషన్: పెదనందిపాడు మండలం పాలపర్రులోని శ్రీ నరసింహ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వజ్రోత్సవాలను మే 10న నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి ఏపీ మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్య తెలిపారు. ఆదివారం లక్ష్మీపురంలోని కాటన్ అసోసియేషన్ సమావేశ మందిరంలో ఆహ్వాన కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమ లోగో, ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రత్తయ్య మాట్లాడుతూ.. 1950లో ముద్దన చెంచయ్య సంస్కృత పాఠశాలగా ప్రారంభించిన పాఠశాల అనంతరం ప్రభుత్వ పాఠశాలగా రూపాంతరం చెందిందని తెలిపారు. వేలాది మంది విద్యాభ్యాసం చేసి దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని గుర్తుచేశారు. పూర్వ విద్యార్థులందరూ వజ్రోత్సవ వేడుకలు, పాఠశాల పూర్వ వైభవానికి చేయూత అందించేందుకు ముందుకురావడం అభినందనీయమని అన్నారు. వజ్రోత్సవ కార్యక్రమాల కమిటీ నాయకుడు డాక్టర్ చిట్టినేని శివ కోటేశ్వరరావు మాట్లాడుతూ.. పాలపర్రు పాఠశాల ఆవరణలో 'సెలబ్రేటింగ్ ది పాస్ట్-ఇన్‌స్పైరింగ్ ది ఫ్యూచర్' అనే అంశంతో మే 1న ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అక్కడ పనిచేసిన పూర్వ ఉపాధ్యాయుల సత్కారం, వివిధ అంశాల్లో పోటీలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ పూర్వ అధ్యక్షులు, కార్యదర్శి మణికుమార్, బండ్లమూడి మధుసూదన్‌రావు, దుద్దెంపూడి సత్యనారాయణ, పెద్ది మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.



వజ్రోత్సవ ఆహ్వాన పత్రికలు విడుదల చేస్తున్న రత్తయ్య తదితరులు

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ ప్రార్థనలు



ప్రత్తిపాడు: ఈస్టర్ వేడుకల్లో క్రీస్తు



ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు



ప్రార్థనలను విశ్వాసులకు తెలియజేస్తున్న గురువులు

పొన్నూరు: ఈస్టర్ పర్వదినాన్ని ఆదివారం క్రైస్తవులు అత్యంత భక్తిభావంతో నిర్వహించారు. క్రీస్తు పునరుత్థాన పండుగ సందర్భంగా యేసు క్రీస్తును కీర్తిస్తూ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణంలో తెల్లవారుజాము నుంచే ఈస్టర్ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈస్టర్ పండుగ సందేశంలో మానవుని జీవితాన్ని సన్మార్గంలో నడిపించడానికి క్రీస్తు బోధనలు దోహదపడతాయని.. లోకంలో పాపపరిహారం కోసమే క్రీస్తు శిలువ మరణం పొందారని.. ఆయన బోధనల్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని పాస్టర్‌లు ప్రార్థన మందిరాల్లో సందేశమిచ్చారు. పాత పొన్నూరులోని లూథరన్ చర్చిలో పాస్టర్ రెవరెండ్ కె. ఆశీర్వాద ప్రార్థన నిర్వహించారు. ఈస్టర్ విశిష్టతను వివరించారు.

కాకుమాను: మండలంలోని గ్రామాల్లో క్రైస్తవులు ఈస్టర్ పర్వదినాన్ని ఆదివారం భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. వేకువజామునే తమ కుటుంబీకుల సమాధుల వద్దకు వెళ్లి వివిధ రకాల పువ్వులు, కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు. ఈస్టర్ పండుగ సందర్భంగా క్రీస్తు మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక ఆంధ్ర ఇవాంజిలికల్ లూథరన్ పరిశుద్ధ దేవాలయంలో పాస్టర్ రెవరెండ్ బోరుగడ్డ కృపాదానం ఈస్టర్ గురించి వివరించారు.

ప్రత్తిపాడు: క్రీస్తు పునరుత్థానంతో విశ్వానికి వెలుగు లభించిందని విచారణ గురువు ఫాథర్ సురేష్ అన్నారు. వట్టిచెరుకూరు మండలం ముట్లూరులోని పునీత శౌరి వారి దేవాలయంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు ప్రత్యేక పునరుత్థాన దిన వేడుకలను నిర్వహించారు. ఫాథర్ మార్నేని దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు నల్లపాడు విచారణ గురువు ఫాథర్ సురేష్, కడప మేత్రాసనం విచారణ గురువు వల్లభనేని మరియదాసులు హాజరయ్యారు. ఈస్టర్ విశిష్టతను విశ్వాసులకు వినిపించారు. దివ్యబలిపూజలో విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెదకాకాని: నంబూరు ఆర్‌సీఎం చర్చిలో ఈస్టర్ పండుగను పురస్కరించుకుని విశ్వాసులు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా చర్చి ఫాథర్ రెవరెండ్ పూదోట నవీన్ ఈస్టర్ విశిష్టతను వివరించారు. క్రీస్తు పునరుద్ధానం ద్వారా ఆయన చేకూర్చే శాంతి, సమాధానములు, సంతోషము ప్రేమ, మానవాళి జీవితాలకు చేకూరాలని ఆశీర్వదించి ప్రార్థించారు. చర్చి కన్వీనర్ డాక్టర్ కూచిపూడి మోహన్‌రావు ప్రజలకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఫాథర్ కోడూరు వినోద్, గ్రామ పెద్దలు కోడూరు కనకరాజు, చర్చి పెద్దలు, యూత్, దళ సభ్యులు దీక్షాపరులు పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

పొన్నూరు: అగ్నిమాపక కేంద్రం అధికారి కె.ప్రసాదరావు ఆధ్వర్యంలో పొన్నూరు అగ్నిమాపక కేంద్రం వద్ద వారం రోజుల పాటు నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు ఆదివారం ముగింపునకు చేరుకున్నాయి. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో కూడిన కరపత్రాలను ఈ సందర్భంగా ఆయన ప్రజలకు పంపిణీ చేశారు. ప్రమాదాల నివారణకు వినియోగించే పరికరాల ప్రదర్శన నిర్వహించారు. ప్రమాదం జరిగితే చేయవలసిన ముందస్తు చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెనాలి ఆర్‌టీఓ మధుసూదనరావు పాల్గొన్నారు. ప్రసాదరావు మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటే వెంటనే శాఖ ఫోన్ నంబరుకు సమాచారం అందించాలని కోరారు. అప్రమత్తంగా ఉంటేనే అగ్ని ప్రమాదాలకు అడ్డుకట్టవేయగలమని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.శ్రీనివాసరావు, చింత శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అగ్ని మాపక కేంద్రం అధికారి ప్రసాదరావు

ఆత్మీయ కలయిక.. ఆనంద వేడుక



1973-74 బ్యాచ్ పూర్వ విద్యార్థులు




గురువులతో 1991-92 బ్యాచ్ విద్యార్థులు

ప్రత్తిపాడు: పది కాదు ఇరవై కాదు.. దాదాపుగా యాభై సంవత్సరాల తరువాత వారంతా అదే పాఠశాల సాక్షిగా కలవడంతో ఆనాటి హృదయాల్లో ఆనంద గీతం వెల్లివిరిసింది. ఆళింగనాలు, ఆప్యాయత ప్రేమాను రాగాలతో ఒక రోజు ఆనందంగా గడిచిపోయింది. ఎంత ఎత్తుకు ఎదిగినా.. ఒకప్పటి పిల్లలమేనంటూ అందరి మదిలోనూ అలనాటి అల్లరి జ్ఞాపకాలు హృదయసరోవరాల్లో నుంచి ఎగసిపడ్డాయి. పెదనందిపాడు మండలం అబ్బినేనిగుంటపాలెం మాకినేని రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన 1973-74 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థుల 'స్వర్ణోత్సవ ఆత్మీయ కలయిక' ఆదివారం ఆనందోత్సాహాల మధ్య జరిగింది. సుమారు 27 మంది పూర్వ విద్యార్థులు 50 ఏళ్ల తరువాత ఒకచోట కలవడంతో ఆనంద లోగిలిలో తేలియాడారు. బాల్యంలో చేసిన అల్లర్లు, సరదా సంగతులు, చెట్ల కింద చదువులు, చేసిన షికార్లు.. అన్నింటినీ మరోమారు నెమరువేసుకుని పులకించిపోయారు. ఇప్పుడు ఆరు పదుల ప్రాయంలోకి చేరువ అయినప్పటికీ, చెమర్చిన కళ్లతో చిన్ననాటి సంగతులను గుర్తుచేసుకున్నారు. కుటుంబ నేపథ్యం .. తదితరాలను ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. మరపురాని స్నేహబంధాన్ని సెల్ఫీలుగా తీసుకుని మురిసిపోయారు. అప్పటి బ్లాక్ అండ్ వైట్ గ్రూప్ ఫొటోలను చూసుకుని కళ్లు తడుపుకొన్నారు. గతించిన గురువులు, మిత్రులను స్మరించుకున్నారు.

ఏబిపాలెం పూర్వ విద్యార్థులు..

ఏబిపాలెం హైస్కూలులో 1991-92లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానిక కల్యాణ మండపంలో అపూర్వంగా జరిగింది. చిన్ననాటి మిత్రులంతా ఒకే వేదికపై ఆటలాడి, చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించుకున్నారు.

వినికిడి లోపాన్ని సరైన పద్ధతిలో మెరుగుపరుచుకోవాలి



లక్ష్మీపురం: పెద్ద వారిలో సహజంగా వినికిడి లోపం ఏర్పడుతుందని, హియరింగ్ ఎయిడ్స్ వాడటానికి సిగ్గుపడరాదని ఆ లోపం వల్ల కుటుంబ సభ్యులు, ఇతరులు పడే ఇబ్బందులను అర్థం చేసుకోవాలని ప్రముఖ ఈఎన్‌టీ వైద్యులు, ప్రొఫెసర్ కె.రవి కోరారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం 'వినికిడి లోపం, చెవి, ముక్కు, గొంతు వ్యాధులపై' ఆరోగ్య సభ నిర్వహించారు. సభకు అనవేమా ట్రస్ట్ అధ్యక్షులు చల్లా అంజిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినికిడి లోపం ఉన్నపుడు ఈఎన్‌టీ స్పెషలిస్ట్‌ని సంప్రదించాలని కోరారు. ఆడియో గ్రామ్ ద్వారా వినికిడికి సంబంధించిన పరీక్షలు చేస్తారని, వినికిడిని సరిదిద్దటానికి హియరింగ్ ఎయిడ్స్ ఇస్తారన్నారు. వృద్ధాప్యంలో ఈఎన్‌టీ సమస్యలు ఎక్కువగా వస్తాయని, చెవిలో హోరు, తల తిరగటం, ముక్కు వెంట రక్తం కారటం, వాయిస్‌లో మార్పులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. థైరాయిడ్ లాంటి వ్యాధుల వలన కూడా గొంతు బొంగురు పోతుందని, గొంతులో మార్పు వచ్చినప్పుడు డాక్టర్‌కి చూపించుకోవడం అవసరమని కోరారు. డాక్టర్ రవిని సంస్థ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, సీనియర్ సభ్యులు దాసరి జాకబ్, సూర్యదేవర రవి కుమార్, చలమారెడ్డి, బసవగుప్త ప్రసంగించారు.

ఇళ్ల మధ్య మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తే ఉద్యమిస్తాం

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా

పట్నంబజారు: నివాసాల మధ్య ప్రజలకు ఇబ్బంది కలిగేలా మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తే.. ఉద్యమిస్తామని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా హెచ్చరించారు. పాతగుంటూరు పరిధిలోని నందివెలుగు రోడ్డులో ఆదివారం సంధ్య బార్ అండ్ రెస్టారెంట్ ప్రారంభిస్తున్న క్రమంలో స్థానికులు అడ్డుకున్నారు. నివాసాలు, ఆలయాలు, నిత్యం విద్యార్థినులు తిరిగే ప్రాంతంలో మద్యం దుకాణం ఎలా ప్రారంభిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా అక్కడకు చేరుకుని నిరసన తెలిపారు. అనంతరం బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులతో ఆమె మాట్లాడారు. ప్రజలు నివసించే ప్రాంతాల్లో బార్‌లు, వైన్స్‌లు ఏర్పాటు తగదని చెప్పారు. దీని వలన స్థానికులు ఎన్నో ఇబ్బందులు పడే అవకాశం ఉందని, బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులు వారి నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మద్యం ఏరులై పారుతోందని ఆరోపించారు. అడ్డుఅదుపూ లేకుండా ఎక్కడబడితే అక్కడ మద్యం దుకాణాలను ఏర్పాటు చేయటం సిగ్గుచేటన్నారు. అధికార యంత్రాగం ఇష్టానూసారంగా నివాసాల మధ్యన ఏర్పాటుకు అనుమతులు ఇవ్వటం సరికాదని చెప్పారు. కచ్చితంగా బార్ అండ్ రెస్టారెంట్‌ను తీసివేయాలని, లేని పక్షంలో ప్రజల పక్షాన ఎంతటి పోరాటానికి వెనుకాడబోమని తెలిపారు.



మహిళలతో కలసి బార్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నూరిఫాతిమా

సైన్స్ ఫలాలు సామాన్యులకు అందాలి


గుంటూరు ఎడ్యుకేషన్: కార్పొరేట్ సంస్థలు పొందుతున్న సైన్స్ ఫలాలను సామాన్య ప్రజలకు చేరువ చేయాల్సిన అవసరముందని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జనవిజ్ఞాన వేదిక కార్యకర్తల శిక్షణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ శాస్త్రీయ విజ్ఞానంపై విద్యార్థులు మక్కువ పెంచుకోవాలని సూచించారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర రాహుల్ మాట్లాడుతూ సమాజంలో ప్రస్తుతం సైన్స్ కంటే సూడో సైన్స్ ప్రచారం ఎక్కువగా జరుగుతోందని, దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జేవీవీ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్.వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రస్తుతం సమాజం ఉన్న పరిస్థితుల్లో జనవిజ్ఞానవేదిక వంటి సైన్స్ ప్రచార సంస్థల అవసరం ఎంతో ఉందని పేర్కొన్నారు. జేవీవీ ప్రతినిధి టీఆర్ రమేష్ మాట్లాడుతూ శాస్త్ర పరిశోధనల్లో మన దేశం ఎంతో వెనుకబడి ఉందని, శాస్త్ర పరిశోధనలకు నిధులు పెంచాల్సిన అవసరముందన్నారు. డాక్టర్ ఎ.సత్యనారాయణ ప్రసాద్ మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథం పెంచుకుని, ప్రతి విషయాన్ని శాస్త్రీయంగా ఆలోచించాలని సూచించారు. కార్యక్రమంలో జేవీవీ ప్రతినిధులు టి.జాన్‌బాబు, బి.ప్రసాద్, బి.ఉదయ్‌భాస్కర్, షేక్ అహ్మద్ హుస్సేన్, ఆర్.స్వాతి, అంకారావు, అనూరాధ, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు యు. రాజశేఖర్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

ఉపాధ్యాయ హక్కుల సాధనలో అలుపులేని పోరాటం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ హక్కుల సాధనలో అలుపులేని పోరాటం చేస్తున్నామని నోబుల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్‌టీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.హైమారావు పేర్కొన్నారు. ఎన్‌టీఏ నాలుగో ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం సంగడిగుంటలోని చలమయ్య హైస్కూల్లో నిర్వహించారు. ఈసందర్భంగా హైమారావు మాట్లాడుతూ ఉద్యమమే ఊపిరిగా, హక్కుల సాధనే లక్ష్యంగా పని చేస్తున్న ఎన్‌టీఏ తక్కువ కాలంలో రాష్ట్రంలోని ఉపాధ్యాయుల ఆదరాభిమానాలు చూరగొని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ముందుకు దూసుకెళ్తోందని తెలిపారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బీవీ నాగేశ్వరావు మాట్లాడుతూ సంఘం ఏర్పడిన మూడేళ్లలోనే రాష్ట్ర వ్యాప్తంగా 20 జిల్లాల్లో శాఖలను ఏర్పాటు చేశామని, సంఘ నిర్మాణం కోసం ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో సభ్యత్వం తీసుకునేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. క్రమశిక్షణ కలిగిన సంఘంగా సీనియర్ నాయకుల అడుగుజాడల్లో ముందుకు సాగుతోందని తెలిపారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖలీల్, గుంటూరు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సాయి విశ్వనాథ్, పి.లలితబాబు, గౌరవ అధ్యక్షుడు ఎన్.వేణుగోపాల్, ఆర్థిక కార్యదర్శి కె.వీరరాఘవులు, ఉపాధ్యక్షుడు టి.శ్రీనివాస్, ఎ.హరగోపాల్, జిల్లా కౌన్సిలర్లు సింగాల వెంకటేశ్వర్లు, ఏవీ కృష్ణారావు, ఎ.వెంకటేశ్వరరావు, చెంచయ్య, నాగరాజు, మున్ని నాయక్, రాములు నాయక్, కె.వేణుగోపాల్, వెంకాయమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హైమారావు

ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో వర్క్‌షాప్

గుంటూరు ఎడ్యుకేషన్: ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో ఆదివారం అరండల్‌పేటలోని యోగి భవన్‌లో ఆరోగ్య కార్యకర్తలకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ శనక్కాయల ఉదయశంకర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ కాకాని పథ్వీరాజు ఆరోగ్య భారతితో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిపై మాట్లాడారు.

24న ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల ధర్నా



లక్ష్మీపురం: ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల వేతన బకాయిలు విడుదల చేయాలని కోరుతూ ఈనె 24న ధర్నా నిర్వహించనున్నట్లు ఏపీ ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయీస్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగురి రాధాకృష్ణమూర్తి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.శ్రీధర్ ఎం.రమేష్ బాబు తెలిపారు. స్థానిక ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. పది నెలలుగా బకాయిలు పెండింగ్ ఉన్నా పట్టించుకోవడం లేదని చెప్పారు. తొమ్మిది సంవత్సరాల నుంచి పనిచేస్తున్న కనీసం హెచ్‌ఆర్ పాలసీ లేదని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించలేదని పేర్కొన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని, పది నెలల వేతనాలు విడుదల చేయాలని కోరుతూ నిర్వహించనున్న ధర్నాలో ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్ కుమార్, హనుమంతరావు పాల్గొన్నారు.